క్లుప్తంగా

కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కో-ఆర్డినేటర్‌గా వినోద్



జక్రాన్‌పల్లి: కాంగ్రెస్ పార్టీ నిజామాబాద్ రూరల్ సోషల్ మీడియా కో–ఆర్డినేటర్‌గా జక్రాన్‌పల్లికి చెందిన సొప్పరి వినోద్ నియమితులయ్యారు. ఈ మేరకు నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలను సోషల్ మీడియా ద్వారా ప్రజలకు వివరిస్తామన్నారు. తన నియామకానికి సహకరించిన జిల్లా యువజన నాయకుడు ఉమ్మాజీ నరేష్, ఐడీసీఎంఎస్ మాజీ చైర్మన్ మునిపల్లి సాయరెడ్డి, పార్టీ అధ్యక్షుడు చిన్నారెడ్డిలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

'పంపిణీ చేయకుంటే ఆక్రమిస్తాం'



ధర్పల్లి: మండల కేంద్రంలోని డబుల్ బెడ్‌రూం ఇళ్లను ప్రభుత్వం పంపిణీ చేయకుంటే నిరుపేదలతో కలిసి ఆక్రమిస్తామని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ నాయకులు రమేష్ హెచ్చరించారు. మంగళవారం నిరుపేదలతో కలిసి తహసీల్దార్ మాలతికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ.. ధర్పల్లిలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణం పూర్తయి మూడేళ్లు గడుస్తున్న లబ్ధిదారులకు పంపిణీ చేయకపోవడం శోచనీయమన్నారు. రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన ఇళ్లు శిథిలావస్థకు చేరుతున్నాయని అన్నారు. ప్రభుత్వం వెంటనే అర్హులను గుర్తించి ఇళ్లను పంపిణీ చేయాలని కోరారు. లక్ష్మి, స్వరూప, జమున, శారద, సులోచన, నూర్జహాన్, జమున, షహనా బేగం తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జిపై నుంచి పడిన ద్విచక్రవాహనం



మోపాల్: మంచిప్ప శివారులోగల గండిమైసమ్మ వద్ద పాత బ్రిడ్జిపై నుంచి ఓ ద్విచక్ర వాహనం అనుమానాస్పదంగా పడింది. విషయం తెలుసుకున్న ఎస్సై యాదగిరి గౌడ్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ద్విచక్రవాహనాన్ని బ్రిడ్జి పైనుంచి తోసేశారా.. లేక బ్రిడ్జిపై నుంచి వెళ్లే క్రమంలో ప్రమాదవశాత్తు పడిపోయిందా అని పోలీసులు ఆరా తీస్తున్నారు. ఏపీ25 ఏఎల్8955 నెంబర్ గల వాహనం బాడ్సి గ్రామానికి చెందిన వ్యక్తిదని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సుభాష్‌నగర్: నగరంలోని 11 కేవీ ముబారక్‌నగర్ ఫీడర్‌లో నిర్వహణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని టౌన్–2 ఏడీఈ ప్రసాద్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముబారక్‌నగర్, మహాలక్ష్మినగర్, ఆర్టీసీ కాలనీ, భాగ్యనగర్ కాలనీ, శ్రీనివాస్‌నగర్, లక్ష్మీప్రియనగర్, జనప్రియనగర్, ఏకశిలానగర్ తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని ప్రసాద్‌రెడ్డి కోరారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి



నిజామాబాద్ సిటీ: కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బుర్రి ప్రసాద్ కోరారు. బుధవారం జిల్లాకేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు నూర్జహాన్, పి.వెంకటేష్, పెద్ది వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమంగా తీర్చిదిద్దేందుకు..

- ప్రతిభను వెలికి తీయడానికి విద్యార్థులకు వేసవి ఉచిత శిక్షణ తరగతులు
- జిల్లా కేంద్రంలోని బాలభవన్‌లో 55 రోజుల పాటు వివిధ కళల్లో తర్ఫీదు



బాలభవన్‌లో డ్యాన్స్ నేర్చుకుంటున్న విద్యార్థులు

నిజామాబాద్ రూరల్: విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి నగరంలోని బాలభవన్‌లో శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి. ప్రతి విద్యార్థికి ఏదో ఒక అంశంపై ఆసక్తి, అందులో ప్రతిభ ఉంటాయి. బడికెళ్లే సమయంలో విద్యార్థులు పుస్తకాలతో కుస్తీ పట్టడానికే సమయం సరిపోదు. అలాంటి విద్యార్థుల కోసం జిల్లా కేంద్రంలోని బాలభవన్‌లో ఏటా ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నారు. పలు అంశాల్లో శిక్షణనిస్తూ విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దుతున్నారు. నగరంలోని బాలభవన్‌లో సుమారు 55 రోజుల పాటు ఆయా అంశాల్లో శిక్షణ ఇస్తారు. గత నెల 16న ప్రారంభమైన శిబిరం జూన్ 10 వరకు కొనసాగనుంది. డ్రాయింగ్, పెయింటింగ్, భరతనాట్యం, జానపద నృత్యం, కర్ణాటక గాత్ర సంగీతం, లలిత సంగీతం, టైలరింగ్, ఎంబ్రాయిడరీ, గ్లాస్ పెయింటింగ్, ఫ్లవర్ బొకే తయారీ, ఐస్‌క్రీమ్ పుల్లలతో అలంకార వస్తువుల తయారీ, క్రాస్ స్టిచ్, మ్యాచ్ వర్క్, పర్సులు.. బ్యాగుల తయారీ, ఉలెన్ వర్క్, మిర్రర్ వర్క్, మోతి వర్క్, జర్దోసి వర్క్, రిబ్బన్ వర్క్, మెహందీ, శ్లోకాలు, పద్యాలు, మ్యాజిక్, గ్రీటింగ్ కార్డుల తయారీ, స్కేటింగ్, యోగా, కర్ర సాము ఇలా 30 అంశాల్లో తర్ఫీదు ఇస్తారు. ఇందులో తరగతిని బట్టి ఆయా అంశాల్లో శిక్షణ పొందే అవకాశం ఉంటుంది. ప్రస్తుత ఎండాకాలం పిల్లలు ఇంటి దగ్గరుండి తల్లిదండ్రులను ఇబ్బందులకు గురిచేస్తారు.

అలాంటిది వారికి విద్యతో వారిలో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికితీయడానికి ఈ శిక్షణ ఎంతగానో దోహదపడుతుంది. ఈ ఏడాది వేసవి శిబిరంలో శిక్షణ పొందేందుకు 680 మంది విద్యార్థులు పేర్లు నమోదు చేసుకున్నారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒకటిన్నర వరకు తరగతులు కొనసాగుతున్నాయి. మొత్తం 14 మంది నిష్ణాతులు ఆయా అంశాల్లో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు.

ఆరేళ్లుగా శిక్షణ..



ఆరేళ్లుగా బాలభవన్‌లో శిక్షణ తీసుకుంటున్నా. డ్యాన్స్, డ్రాయింగ్, మ్యూజిక్, కర్రసాము తరగతులకు హాజరవుతున్నా. వేసవి సెలవులను వృథా కాకుండా ఇలా వినియోగించుకుంటున్నాను.
– నీత, 9వ తరగతి, ప్రెసిడెన్సీ హైస్కూల్

డ్రాయింగ్ అంటే ఇష్టం



నాకు చిన్నప్పటి నుంచి డ్రాయింగ్ అంటే ఎంతో ఇష్టం. అలాగే మ్యూజిక్, డ్యాన్స్‌లపై కూడా ఆసక్తి ఉంది. అందుకే బాల భవన్‌లో చేరాను. ఇక్కడి టీచర్లు ఎంతో శ్రద్ధతో నేర్పిస్తున్నారు.
– అరుఫ్, 3వ తరగతి, ప్రెసిడెన్సీ స్కూల్

ఎంతో మంది స్నేహితులయ్యారు



నేను భరతనాట్యం, పెయింటింగ్, డ్రాయింగ్లో శిక్షణ పొందుతున్నాను. చిన్నప్పటి నుంచి పెయింటింగ్ వేయడం అంటే ఎంతో ఇష్టం. ఇక్కడ వేరే పాఠశాల విద్యార్థులు మంచి స్నేహితులయ్యారు. ప్రతిరోజు తరగతులకు హాజరవుతున్నాను. – సుదీక్ష, 7వ తరగతి, జీహెచ్ఎస్ (కోటగల్లి శంకర్‌భవన్)

యోగాలో శిక్షణ పొందుతున్నాను



బాలభవన్‌లో ఐదేళ్ల నుంచి యోగా నేర్చుకుంటున్నాను. వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలని ప్రతి రోజు వస్తున్నాను. ఇక్కడ ఎంతో మంది స్నేహితులు కలుస్తారు. శిక్షకులు బాగా చెబుతున్నారు.
–ప్రణయ్‌రాజ్, 8వ తరగతి, జెడ్పీహెచ్ఎస్(దూపల్లి)

ప్రతిభను వెలికితీస్తాం



ప్రతి విద్యార్థిలో చదువుతో పాటు ఏదో ఒక ప్రతిభ దాగి ఉంటుంది. దాన్ని వెలికి తీయడానికే శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నాం. ఇప్పటికే 680 మంది హాజరవుతున్నారు. ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నాం. విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. –ఉమాబాల, బాలభవన్ ఇన్‌చార్జిసూపరింటెండెంట్

అలరించిన ఇంద్రజాల ప్రదర్శన



ఇంద్రజాలం ప్రదర్శిస్తున్న రంగనాథ్



రంగనాథ్‌ను సన్మానిస్తున్న బాలభవన్ సిబ్బంది

నిజామాబాద్ రూరల్: వేసవి శిక్షణ తరగతులలో భాగంగా మంగళవారం జిల్లా బాలభవన్‌లో జాదూ యుగంధర్ రంగనాథ్ ప్రదర్శించిన ఇంద్రజాల ప్రదర్శన అలరించింది. మొదటి నుంచి చివరి వరకు పిల్లల కేరింతలు, అరుపులు, చప్పట్లతో బాలభవన్ ప్రాంగణమంతా మార్మోగిపోయింది. ఒక విద్యార్థి తలపై మంటపెట్టి టీ తయారుచేసి వారికే తాగించారు. పెద్ద న్యూస్‌పేపర్‌ను ముక్కలు ముక్కలుగా చేసి క్షణంలోనే అతికించేశారు. ఇలా పలు ఇంద్రజాల ప్రదర్శనలు ఇచ్చారు. అనంతరం రంగనాథ్ మాట్లాడుతూ...ఇంద్రజాలం వల్ల పిల్లలో ఉన్న భయాలు తొలగి విజ్ఞానవంతులుగా మారుతారన్నారు. ఆ తర్వాత ఆయన్ను సన్మానించారు. బాలభవన్ ఇంచార్జి సూపరింటెండెంట్ ఉమాబాల, విఠల్ ప్రభాకర్, వెంకటలక్ష్మి, పుష్పలత, లలిత, సోని, లత, గణేష్, శ్రీలత, లక్ష్మణ్ తదితరులున్నారు.

పోలీసుల కవాతు



దుబ్బాకలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

ధర్పల్లి: దుబ్బాకలో మంగళవారం పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు గ్రామస్తులకు పలు సూచనలు చేశారు. దొంగతనాలు జరగకుండా తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగరాదని చెప్పారు. పిల్లలకు సెలవులు ఉన్నందున తల్లిదండ్రులు పిల్లల పట్ల నిర్లక్ష్యం వహించకుండా ఎప్పటికప్పుడు కనిపెట్టాలన్నారు. పిల్లలను చెరువులు, బావుల వద్దకు ఈతకు పంపరాదని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని.. చట్టారీత్యా నేరం అవుతుందన్నారు. ప్రజలలో భయాందోళనలను తొలగించడానికే కవాతు నిర్వహించామని సీఐ భిక్షపతి తెలిపారు. ఎస్సై రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

శక్తి కేంద్రం ఇన్‌చార్జీల నియామకం



పాల్గొన్న బీజేపీ నాయకులు

ఇందల్వాయి: ఇందల్వాయి మండల శక్తి కేంద్రం ఇన్‌చార్జీలను సీనియర్ కార్యకర్త ఆధ్వర్యంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు కులాచారి దినేష్ ఆదేశాల మేరకు మంగళవారం నియమించారు. బీజేపీ నాయకులు నాయిడి రాజన్న , వాసు, చిన్ను, కిషన్, లక్ష్మీనారాయణ, శేఖర్, ప్రదీప్, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం వ్యాఖ్యలు సరికాదు



మాట్లాడుతున్న పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు మోహన్ రెడ్డి..



తపస్ జిల్లా అధ్యక్షులు కృష్ణవేణి

నిజామాబాద్ అర్బన్: ఉద్యోగ, ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులపై సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు సరైనవి కావని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మోహన్ రెడ్డి, తపస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పరశి కృష్ణవేణి, బట్టు బద్రీనాథ్‌లు వేర్వేరుగా పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని టీఆర్టీ భవన్లో, తపస్ కార్యాలయంలో వేర్వేరుగా వారు మాట్లాడారు. ఉద్యోగ ఉపాధ్యాయులు తమ జీతాల నుంచి జమ చేసుకున్న డబ్బులను మాత్రమే అడుగుతున్నారన్నారు. రెండు సంవత్సరాల నుంచి అన్నిరకాల బిల్లులు రావడం లేదని వాపోయారు. అలాగే పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలన్నారు.

కార్మికులపై పనిభారం తగ్గించండి

సుభాష్‌నగర్: విద్యుత్ సంస్థలో పని చేస్తున్న కార్మికులపై పని భారం తగ్గించాలని, సబ్‌స్టేషన్లలో ఖాళీగా ఉన్న ఆపరేటర్ పోస్టులు భర్తీ చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ ఆర్. రవీందర్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్, యూనియన్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ సింగిరెడ్డి చంద్రారెడ్డి మాట్లాడుతూ.. ఆర్టిజన్ ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రతి సబ్‌స్టేషన్‌లో ముగ్గురు డ్యూటీ చేసే విధంగా తాత్కాలికంగా, ఇతర ఉద్యోగులతోనైనా పని చేయించాలని కోరారు. వెంటనే సమస్యలు పరిష్కరించాలని, లేకుంటే కార్మికులు, ఉద్యోగులతో కలిసి ఉద్యమిస్తామని పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షుడు నరేష్, ప్రధానకార్యదర్శి గంగాధర్, ప్రభాకర్, మురళీ, థామస్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ చెల్లించేందుకు చర్యలు చేపట్టాలి



వినతిపత్రం అందజేస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు

నిజామాబాద్ నాగారం: రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు.. లైఫ్ సర్టిఫికేట్‌ను మీ–సేవ, టీ–యాప్ ద్వారా సమర్పించినా కూడా నిజామాబాద్ జిల్లాలో దాదాపు 753 మందికి ఏప్రిల్ నెల పెన్షన్ రాలేదని తక్షణమే వారికి పెన్షన్ వచ్చేలా చర్యలు చేపట్టాలని కోరుతూ మంగళవారం తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ నిజామాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ట్రెజరరీ డిప్యూటీ డైరెక్టర్ దశరథ్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు కె.రామ్మోహన్‌రావు మాట్లాడుతూ.. పెన్షన్ రానివారు తక్షణమే సంబంధిత ఎస్‌టీవో కార్యాలయాలకు 7799934018 లేదా 9912994202 నంబర్లకు వీడియోకాల్ చేసి పీపీవో ఐడీని తెలిపి లైఫ్ సర్టిఫికెట్‌ను అప్డేట్ చేసుకోవాలని, లేదా సంబంధిత ఎస్‌టీవో కార్యాలయాలకు ప్రత్యక్షంగా వెళ్లి అప్డేట్ చేసుకోవాలన్నారు. ఈ నెల 15 లోపుగా పెన్షన్ రానటువంటి వారికి పెన్షన్ చెల్లించేందుకు చర్యలు చేపడతానని సంఘ ప్రతినిధులకు హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. డివిజన్ అధ్యక్షులు శిర్ప హనుమాన్లు, జిల్లా కోశాధికారి ఈవీఎల్ నారాయణ, నేతలు లావు వీరయ్య, అమీరుద్దీన్, లక్ష్మీనారాయణ, మాణిక్యం, యగ్నేష్ తదితరులున్నారు.

బల్దియా కమిషనర్‌కు సమ్మె నోటీసు



నిజామాబాద్ సిటీ: దేశవ్యాప్తంగా ఈ నెల 20న జరిగే సమ్మెకు సంబంధించిన నోటీసును బహుజన లెఫ్ట్ ట్రేడ్ యూనియన్(బీఎల్‌టీయూ) నాయకులు మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్‌కు మంగళవారం అందజేశారు. బుధవారం బల్దియా కార్యాలయం వద్ద మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ అధ్యక్షుడు దండి వెంకట్ మాట్లాడుతూ.. కార్మికులకు రూ.30 వేల కనీస వేతనం ఇవ్వాలన్నారు. కార్మికుల పని గంటలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్త సమ్మె నిర్వహిస్తున్నారని, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. మేకల రాజేందర్, కొమ్ము రాహుల్, ఆర్. మురళి, నవీన్ పాల్గొన్నారు.

నూతన బిల్లును ఉపసంహరించుకోవాలి



సిరికొండ: కేంద్ర ప్రభుత్వం తెస్తున్న నూతన వ్యవసాయ మార్కెట్ బిల్లును ఉపసంహరించుకోవాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం మండలాధ్యక్షుడు నారాగౌడ్ కోరారు. తహసీల్దార్ రవీందర్‌రావుకు మంగళవారం వినతి పత్రం అందజేశారు. అనంతరం నారాగౌడ్ మాట్లాడుతూ.. ఎన్ఆర్ఈజీఎస్ పథకం ద్వారా ప్రతి కుటుంబానికి 200 రోజులు పని కల్పించి దినసరి కూలీ రూ.600 ఇవ్వాలన్నారు. ఈ నెల 8న హైదరాబాద్‌లో చేపట్టే ధర్నాకు రైతులు తరలి రావాలని కోరారు. నేతలు రమేష్, లింబాద్రి, రమేష్, తదితరులున్నారు.

పాలకేంద్రాలకు జరిమానాలు



నిజామాబాద్ సిటీ : మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు పాల కేంద్రాలలో బల్దియా అధికారులు తనిఖీలు నిర్వహించారు. బుధవారం గాం, దీగంజ్, ఖలీల్‌వాడి, అర్సపల్లి, కోటగల్లీ తదితర ప్రాంతాల్లో పాల కేంద్రాలు నిర్వహిస్తున్న దుకాణాలను పరిశీలించారు. అపరిశుభ్ర వాతావరణం, నిషేధిత ప్లాస్టిక్ కవర్లు వాడుతున్న దుకాణదారులకు రూ.14 వేల వరకు జరిమానా విధించారు. మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ జయకుమార్, శానిటరీ సూపర్‌వైజర్ సాజిద్ అలీ, ఎస్సై మహిపాల్ తదితరులున్నారు.

సమాచారం..

నేడు 4 గ్రామాల్లో కల్తీ కల్లుపై అవగాహన

డిచ్‌పల్లి: మండలంలోని ఘన్‌పూర్, సుద్దులం, మెంట్రాజ్‌పల్లి, రాంపూర్ గ్రామాల్లో బుధవారం కల్తీ కల్లు, గంజాయి, డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిచ్‌పల్లి ఎస్సై ఎండీ షరీఫ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం ఘన్‌పూర్, సుద్దులం గ్రామాలు, సాయంత్రం మెంట్రాజ్‌పల్లి, రాంపూర్ గ్రామాల్లో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

9నుంచి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు

నిజామాబాద్ రూరల్: నగరంలోని వినాయక్‌నగర్ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 9 నుంచి 11 వరకు జరుగుతాయని ఆలయ అధ్యక్షుడు క్యాసారం రవీందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలన్నారు.

10నుంచి ఇందల్వాయిహైస్కూల్లో సమ్మర్ క్యాంప్

ఇందల్వాయి: ఇందల్వాయి ఉన్నత పాఠశాలలో ఈ నెల 10 నుంచి 25 వరకు సమ్మర్ స్పెషల్ క్యాంపు నిర్వహించనున్నట్లు ఎంఈవో శ్రీధర్ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే ఈ క్యాంపులో హైస్కూల్ విద్యార్థులకు సంగీతం, డ్యాన్స్, స్వీయ రక్షణ, పెయింటింగ్, డ్రాయింగ్, యోగ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం పూట అల్పాహారం కూడా అందిస్తామని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు పాఠశాల హెడ్మాస్టర్ లక్ష్మీనాథంను పాఠశాలలో సంప్రదించాలని తెలిపారు.

'విద్యుత్ ప్రమాదాలపై అవగాహన ఉండాలి'



ధర్మారం(బి)లో అవగాహన కల్పిస్తున్న ఏడీఈ బాలేష్

డిచ్‌పల్లి: విద్యుత్ వల్ల జరిగే ప్రమాదాలపై ప్రతి ఒక్కరూ సరైన అవగాహన కలిగి ఉండాలని అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్(ఏడీఈ) బాలేష్ కుమార్ సూచించారు. విద్యుత్ భద్రతా వారోత్సవాల సందర్భంగా మంగళవారం బర్ధిపూర్ సెక్షన్ పరిధిలోని బర్ధిపూర్, ధర్మారం(బి) గ్రామాల్లో ప్రజలకు విద్యుత్ ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఈడీ మాట్లాడుతూ.. విద్యుత్ సరఫరాలో ఏవైనా సమస్యలు తలెత్తితే వినియోగదారులు సొంతంగా మరమ్మతులు చేపట్టకుండా సంబంధిత సిబ్బందికి సమాచారం అందించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి విద్యుత్ ప్రమాదాలను నివారించాలన్నారు. సబ్ ఇంజనీర్ మోహినుద్దీన్, సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్ నాంపల్లి, లైన్ ఇన్‌స్పెక్టర్ నవీన్, తదితరులు పాల్గొన్నారు.

సొంతంగా మరమ్మతులు చేసుకోవద్దు

ధర్పల్లి: విద్యుత్ మరమ్మతులు ఉంటే వినియోగదారులు సొంతంగా మరమ్మతులు చేసుకోవద్దని, విద్యుత్ సిబ్బందికి తెలియజేయాలని ఎన్‌పీడీసీఎల్ డిచ్‌పల్లి డివిజన్ ఏడీఈ శ్రీనివాస్ సూచించారు. మంగళవారం విద్యుత్ భద్రత వారోత్సవాల్లో భాగంగా ధర్పల్లి మండల కేంద్రంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా భద్రతా వారోత్సవాల వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఏడీఈ శ్రీనివాస్ మాట్లాడుతూ.. విద్యుత్ సమస్యలపై రైతులు, వినియోగదారులు టోల్ ఫ్రీ నెంబర్ 1912ను సంప్రదించాలన్నారు. ఏఈ నాగేశ్వర్, సబ్ ఇంజనీర్ గౌతమ్, తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)	
స్క్రీన్-1	హిట్-10.30, 1.30, 4.30, 7.30, 10.30
స్క్రీన్-2	థండర్‌బోల్ట్స్(ఇంగ్లీష్)-11.00, 4.40 రెట్రో-1.30, 7.20, 10.30
స్క్రీన్-3	రైడ్-2(హిందీ)-11.00,1.40,4.30, 10.30 థండర్‌బోల్ట్స్(ఇంగ్లీష్)-7.40
పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)	
స్క్రీన్-1	హిట్-9.50, 1.05, 4.20, 7.35, 10.50
స్క్రీన్-2	రెట్రో-10.10, 4.25, 10.40 థండర్ బోల్ట్స్(3డీ)-1.35, 7.50
స్క్రీన్-3	రైడ్-2(హిందీ)-10.00, 4.25, 10.50 రెట్రో-1.00, 7.25
స్క్రీన్ -4	తుడరుమ్-10.15, 1.35 సారంగపాణి జాతకం-4.55 రైడ్-2(హిందీ)-7.45 - జింఖానా-10.45
లలితామహల్ రెట్రో	దేవి థండర్ బోల్ట్స్ 2డీ
నటరాజ్ రైడ్-2(హిందీ)	విజయ్ హిట్

వివిధ రకాల వరి వంగడాలు అందుబాటులో ఉన్నాయి



మాట్లాడుతున్న అన్వేష్

నిజామాబాద్‌అర్బన్: మార్కెట్‌లో నాణ్యమైన విత్తనాలనే విక్రయించాలని విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఏవోలు, డీలర్లతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరి వంగడాలైన బీపీటీ–5204, కేఎన్ఎం–1638తో పాటు ఇతర వంగడాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. డీలర్లకు ఆరు శాతం సర్వీస్ చార్జీలను ఇస్తామన్నారు. రెండు టన్నుల వరకు విత్తనాలను కొన్న రైతులకు మేలుచేసే విధంగా ఇంటి వద్దకే ఆరు శాతం డిస్కౌంట్ ఇస్తు సరఫరా చేస్తామన్నారు.



పాల్గొన్న డీలర్లు, మండల వ్యవసాయ అధికారులు

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	98,900	వెండి(కిలో)	1,01,500
22 క్యారెట్స్	91,300	– నిజామాబాద్ బిజినెస్	

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	190
		లైవ్	160
స్కిన్‌లెస్	220	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	6	12	గాజరుగడ్డ	30	60
బెండకాయ	40	50	పచ్చిమిర్చి	35	50
జీరకాయ	50	80	దోసకాయ	20	40
దొండకాయ	30	50	ఆలుగడ్డ	25	50
బీర్నీసుకాయ	80	120	గోజుగడ్డ	8	16
కాకరకాయ	35	60	గోబిపువ్వు	25	50
వంకాయ	20	40	బీట్‌రూట్	25	50
పాలకూర	20	40	కరివేపాకు	50	80
మెంతికూర	70	100	చామగడ్డ	60	80
కొత్తిమీర	20	40	గోరుచిక్కుడు	40	60
పుదీనా	40	60	చిక్కుడుకాయ	40	60
క్యాప్సికం	40	80	మామిడికాయ	30	50

–సుభాష్‌నగర్